క్లుప్తంగా

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

హుడాకాంప్లెక్స్: అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు 58, 59 జీవో ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఇందుకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2014 జూన్ 2 వరకు ఉన్న ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు గతంలో అవకాశం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం 2020 జూన్ 2 వరకు గడువును పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలయాల కమిటీ ఎన్నిక


వాసుదేవరెడ్డి

మహేశ్వరం: మామిడిపల్లిలోని ధ్యాసాంజనేయ స్వామి ఆలయం, రంగనాయకుల స్వామి ఆలయం, శివాలయాలకు ఆదివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మూడు ఆలయాల కమిటీ అధ్యక్షుడిగా ఎడ్ల వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్‌కె.కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పి.సురేష్, ఎం.జగన్నాథ రెడ్డి, కె.జగదీష్, ప్రధాన కార్యదర్శులుగా ఎల్.శ్రీకాంత్ గౌడ్, కె.మధు యాదవ్, ఎస్.అశోక్ గౌడ్, కోశాధికారులుగా కె.విష్ణు, చైతన్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థుల సహకారంతో ఆలయాల అభివృద్ధికి పాటుపడుతామన్నారు. మూడు ఆలయాల వద్ద సదుపాయాలు మెరుగు పరిచి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. నిత్యం దూప, దీప నైవేద్యాలు సమర్పిస్తామన్నారు.

ఎంపీపీకి జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఎంపీపీ జ్యోతి

కందుకూరు: సావిత్రీ బాయి పూలే మహిళా లీడర్ షిప్ జాతీయ అవార్డును కందుకూరు ఎంపీపీ ఎం జ్యోతి అందుకున్నారు. బహుజన సాహితీ అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అవార్డును ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


పనామా చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సామ రంగారెడ్డి

వనస్థలిపురం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు రావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. వనస్థలిపురం పనామా చౌరస్తాలోని బస్టాప్ వద్ద యలమంచిలి భానుప్రసాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. యలమంచిలి భానుప్రసాద్, నూతి శ్రీనివాస్, బాలాజీనాథ్, యు.వి.ఎన్.బాబు, గోవర్ధన్, వెంకటరెడ్డి, విజయ్‌కుమార్, నరసింహారావు, రాజేశ్వర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, రవిశంకర్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రవీందర్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: బార్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ రవీందర్‌కు ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌ఖాన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను సన్మానించారు. నిరంతరం పేద ప్రజల కోసం పరితపించే నాయకుడు, న్యాయవాది రవీందర్ అని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని కోరారు.

భూ రికార్డులు సరిచేయండి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో భూ రికార్డులను సరిచేయుటకు వీలుగా ధరణి పోర్టల్ ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో కొంతమంది రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆన్‌లైన్ రికార్డు నుంచి రైతుల పేర్లు తొలగించడం జరిగిందన్నారు. కావాలని కొంతమంది కింది స్థాయి రెవెన్యూ ఉద్యోగులు అక్రమంగా రికార్డుల్లో పేర్లు నమోదు చేశారు. భూమి లేకుండా ఆక్రమణదారుల పేరు మీద రికార్డులు నమోదు చేయడం జరిగిందన్నారు. వాస్తవాలను పరిశీల చేసి నిజమైన పట్టాదారుల పేర్లమీద భూమి పట్టా రికార్డులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ రికార్డులు తొలగించి నిజమైన రైతులకు న్యాయం చేయాలన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

- మంత్రి సబితారెడ్డి
- పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని పిలుపు


పహాడీషరీఫ్: చిన్నారికి వినికిడి పరికరం అమర్చుతున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మెచ్చి అన్ని పార్టీల వారు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మాజీ సర్పంచ్ సీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాం కాలనీకి చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంకర్, లక్ష్మీనారాయణ, నాయకులు నిరంజన్, రాజేష్, అర్జున్, నగేష్, సుభాష్, కే పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి వినికిడి పరికరం

జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీకి చెందిన చిన్నారికి వినికిడి లోపం ఉండడంతో మంత్రి సబితారెడ్డి ఆదివారం వినికిడి పరికరం అందజేశారు. కాలనీకి చెందిన వెంకటేష్ గౌడ్ కుమార్తె వైష్ణవి వినికిడి లోపంతో బాధ పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ పీ శంకర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సొంత నిధులతో మిషన్‌ను తెప్పించి చిన్నారికి అందజేశారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు మంత్రికి కౌన్సిలర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

రోడ్డును బాగు చేయాలని వినతి

మీర్‌పేట: రోడ్డును అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకులు సీ శ్రవణ్‌కుమార్ ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీర్‌పేట పరిధిలోని లెనిన్‌నగర్ ప్రధాన రహదారిని 25 ఏళ్ల క్రితం నిర్మించడం జరిగిందని, గతంలో వచ్చిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని తెలిపారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మంత్రికి వివరించారు. 5 డివిజన్ల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వెంటనే రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి

మహేశ్వరం: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ సూచించారు. ఆదివారం మండలంలోని కేసీ తండా ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో హైదరాబాద్ నాంపల్లికి చెందిన ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్కూల్ మైదానంలో మొక్కలు నాటారు, పాఠశాల మైదానాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి వలంటీర్లు సామాజిక అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డా. డి.వరలక్ష్మి, శ్రీనివాసరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈ ఉదయశ్రీ, వి.శ్రీలత, సుచేత, అధ్యాపకులు బాబు, వలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే


విద్యార్థుల నృత్య ప్రదర్శన

హుడాకాంప్లెక్స్: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన పునాదులు వేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని, వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా రాణిస్తారని గౌతమ్ వరల్డ్ పాఠశాల చైర్మన్ ఎం వెంకటనారాయణ అన్నారు. శనివారం రాత్రి సరూర్‌నగర్‌లోని గౌతమ్ వరల్డ్ పాఠశాల 4వ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్‌డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పుడు పొందే ఆనందం విద్యార్థులకు అందించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంతో భావోద్వేగాలతో ఆనందోత్సాహాలతో నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు పాఠశాల దశ ఎంతో ముఖ్యమైందన్నారు. క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవాన్ని చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్, డైరెక్టర్లు శ్రీకాంత్, భరత్, ప్రిన్సిపాల్, ప్రత్యూష, కవిత తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


నేదునూరు మోడల్ స్కూల్‌లో బోర్డుపై హాల్ టికెట్ నంబర్లు రాస్తున్న సిబ్బంది

కందుకూరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కందుకూరు బాలుర పాఠశాలలో ఒకటి, నేదునూరు మోడల్ స్కూల్‌లో రెండు, కందుకూరు చౌరస్తాలోని నోబుల్ స్కూల్‌లో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. కందుకూరు బాలుర పాఠశాల కేంద్రంలో 120 మంది విద్యార్థులు, నేదునూరు మోడల్ స్కూల్ 'ఏ' కేంద్రంలో 200 మంది, 'బీ' కేంద్రంలో 195 మంది, నోబుల్ స్కూల్ కేంద్రంలో 250 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మొత్తం 765 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

యోగా తరగతులు ప్రారంభం

హుడాకాంప్లెక్స్: షిర్డీసాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతులు కర్మన్‌ఘాట్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పలు కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేశారు. ప్రస్తుతం కోవిడ్ భయాలు వెంటాడుతున్న తరుణంలో శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థను పెంచుకోవడానికి ఈ యోగా శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని షిర్డీసాయి అష్టాంగ యోగా శిక్షణ వ్యవస్థాపకులు ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం జరిగే ఈ శిక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యోగా శిక్షణలో వ్యాయాం, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ఆసనాలు నేర్పనున్నట్లు తెలిపారు.


యోగాలో శిక్షణ ఇస్తున్న ఇస్మాయిల్ గురూజీ

కళలను బతికించుకుందాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


కళాకారులకు సహాయం అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను బతికించుకుందామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఫౌండేషన్ నిధులచే కళలకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. మండల పరిధిలోని పడకల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బీరప్పస్వామి చరిత్ర స్టేజీ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వీధి నాటకాలు వేయడం అభినందనీయమన్నారు. అనంతరం నాటక కళాకారులకు ఆయన రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా చిత్రాలు గీసి చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించిన పవన్‌ను ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి ఆదివారం కలుసుకున్నారు. పవన్ చిత్రకళలో రాణించడానికి సహాయ సహకారాలు అందజేస్తానని వరప్రసాద్‌రెడ్డి భరోసా పలికారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తుల్లా రాములుగౌడ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో తిరుపతి, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు నూనె రాఘవేందర్, నరేందర్‌గౌడ్, భరత్, శివా, విజయ్, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్

ఎంపీటీసీ మంగ


చెక్కులు అందజేస్తున్న ఎంపీటీసీ మంగ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపన్న హస్తంగా నిలుస్తుందని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం అనంతరం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఎం.వనజకు రూ.60 వేలు, ఎదుళ్ల లక్ష్మయ్యకు రూ.35,500, ఎదుళ్ల పెంటయ్యకు రూ.45500, కె.వెంకటేష్‌కు రూ.49500 చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఎప్పుడూ కూడా ఇంత పెద్దఎత్తున సీఎం సహాయనిధి చెక్కులు అందజేయలేదన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సిఫారసు మేరకు ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల సీఎంఆర్‌ఎఫ్ సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో పోల్కంపల్లి మాజీ సర్పంచ్ దానయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రి నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, టీఆర్‌ఎస్ నాయకులు ధన్‌రాజ్, వినోద్‌రెడ్డి, బాలకిషన్, దానయ్య, జంగయ్య, అంజయ్య, రంగయ్య, యాదయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆగని 'ప్రైవేట్' ఆగడాలు

వసతులు నిల్.. ఫీజులు ఫుల్
- మారని ప్రైవేట్ పాఠశాలల తీరు
- పట్టించుకోని విద్యాశాఖ

పహాడీషరీఫ్: బాలాపూర్ మండలంలో ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రైవేటు పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నాయి. పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ లోపభూయిష్ట విద్యా విధానాన్ని అవలంబిస్తున్నారు. బీఈడీ, డీఈడీ, టీటీసీ చేసిన ఉపాధ్యాయులే కొనసాగాల్సి ఉన్నా అవేమి పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, స్టేషనరీ తదితర వాటిని విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. ఒక్కో విద్యార్థికి కేవలం పుస్తకాలకే రూ. 5 వేల నుంచి రూ. 6 వేలు గుంజేస్తున్నారు. ఇక గుర్తింపు లేని పాఠశాలలు కూడా యథేచ్ఛగా సాగుతున్నాయి.

ఇష్టానుసారంగా ఫీజులు

మండలంలోని మెజార్టీ ప్రైవేటు పాఠశాలల ఫీజులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 15 వేల నుంచి రూ. 40 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. అయితే ఆయా పాఠశాలల యాజమన్యాలు ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 400 రూ. 500లు తీసుకుంటున్నట్లు విద్యాశాఖకు సమర్పించడం గమనార్హం. ప్రతి పాఠశాలలో నర్సరీ విద్యార్థులకు కూడా రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారడంతో సగం వేతనం ఫీజులకే పోతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఫీజు స్ట్రక్చర్‌కు సంబంధించి బోర్డును కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజులపై నియంత్రణ తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తికాకముందే చిన్నారులను పాఠశాలలో చేర్పించుకునేందుకు టీచర్లను గడపగడపకూ తిప్పడం ప్రారంభించారు.

సదుపాయాలు నిల్

మండలంలోని చాలా ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి సదుపాయాలు లేవు. స్కూల్ భవనాలు ప్రమాదకరంగా అగ్గి పెట్టెలను తలపిస్తున్నాయి. పాఠశాలల్లో వెంటిలేషన్, లైటింగ్, మూత్రశాలలు, మంచినీరు, ఫర్నీచర్, మైదానం, తరగతి గదుల్లో అగ్నిమాపక పరికరాలు ఉండాలి. కానీ వీటిని ఆయా పాఠశాలల యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మండలంలో సగానికిపైగా ఇలాంటి పాఠశాలలే కనిపిస్తాయి. పాఠశాల గదుల్లోకి సూర్యకాంతి పడే దాఖలాలే లేవు. ఈ కారణంగా కూడా విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం కూడా ఉంది.

అధికారుల తీరుపై అనుమానాలు

ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గుర్తింపులేని పాఠశాలలతో పాటు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ యాజమాన్యాల నుంచి మామూళ్లు తీసుకుంటున్నందునే అధికారులు మిన్నకుండి పోతున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో స్టేషనరీ లాంటి వాటి పట్ల కూడా అధికారులు నజర్ పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఫీజులు, పాఠశాలల్లో వసతులపై విద్యాశాఖ దృష్టి సారించాల్సి ఉంది.

58, 59 జీఓలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 58, 59 జీవోల కింద రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉప్పరిగూడలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, గ్రామ కంఠం భూముల్లో అసంపూర్తిగా, పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు చేసిన వారు ఈ జీఓల కింద రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈనెల 20వ తేదీలోపు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను పూర్తిచేయాలని కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. పది గ్రామాలను కలుపుకొని మండలానికి రెండు చొప్పున ఈ సమ్మేళనాలను జరపాలన్నారు. పార్టీ శ్రేణులందరినీ కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఇంజాపూర్ నాయకులతో రంగారెడ్డి

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో ఆయన పర్యటించారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, మేతరి అనురాధ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన దశరథం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన అతని చిన్ననాటి మిత్రులు పరామర్శించి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని మిత్రుడి కుటుంబ సభ్యులకు ధైర్యానిచ్చారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఉదయం బొడ్రాయికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు బొడ్రాయికి బోనాలు సమర్పించారు.ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. వేడుకలలో సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ మంగమ్మ, జెడ్పీటీసీ అనురాధ, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, స్థానిక నాయకులు కొండయ్య, నర్సింహ, మల్లేష్, విజయ్, కృష్ణారెడ్డి, జంగారెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేందర్, కార్తీక్, వెంకటయ్య, విక్రం, తిరుపతయ్యగౌడ్, సత్యం, నర్సింహ, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత


రాములమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యుత్ శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు తీవ్ర ప్రమాదానికి గురై నాలుగేళ్లుగా మంచానికే పరిమితమైన సంజీవ కుటుంబానికి ఐక్యతా ఫౌండేషన్ అండగా నిలిచింది. సంజీవ కుటుంబం జీవనోపాధికి ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఇటీవల పర్యటించారు. ఈసందర్భంగా సంజీవను ఆయన పరామర్శించారు. తన కుటుంబానికి సాయం అందించాలని సంజీవ అభ్యర్థించారు. దీంతో పోలెపల్లి గ్రామంలో సంజీవ భార్య రాములమ్మ కిరాణా షాపు నిర్వహించుకోవడానికి వీలుగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష సాయం అందించారు. తన కుటుంబం జీవనోపాధికి సాయం అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి సంజీవ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పోలెపల్లి సర్పంచ్ బాల్‌రాం, ఎంపీటీసీ సభ్యులు కుమార్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సత్యం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన విప్లవకారుడు సర్వాయిపాపన్న

ఆమనగల్లు: బహుజన విప్లవకారుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతిని ఆమనగల్లు పట్టణంలో ఆదివారం గౌడసంఘం, బీఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. జాతీయ రహదారిపై పాపన్నగౌడ్ చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, గౌడసంఘం నాయకులు అల్లాజీగౌడ్, గంగారవిగౌడ్, కుమార్‌గౌడ్, నారాయణగౌడ్, నాగయ్య పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలు ఏకం కావాలి

డీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహమాన్


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మంచాల: దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం మంచాల మండలంలోని జాపాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కాలని విశారదన్ మహరాజ్ 10వేల కిలోమీటర్లు స్వరాజ్య పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ యాత్రకు మద్దతుగా కోటి సంతకాలను సేకరిస్తున్నామని తెలిపారు. దేశంలోని 90 శాతం ప్రజలకు సంబంధించిన సంపద కేవలం పదిమంది చేతుల్లోనే ఉందని.. అందరికి సమాన న్యాయం, అన్ని రంగాల్లో సమానత్వం లభించాలన్నారు. అప్పుడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలు సాకారం అవుతాయని అన్నారు. దీనికోసం బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్, మంచాల మండల కన్వీనర్ ఆనంద్, మండల నాయకులు ప్రదీప్, శ్రావణ్, వినోద్, రంజిత్, బాబురావు, రామప్ప తదితరులు పాల్గొన్నారు.